నమస్తే తెలంగాణ
సంగారెడ్డి
I | హైదరాబాద్, సోమవారం 5 ఆగస్టు 2024 | SANGAREDDY

మూడు పీజీ కోర్సులు మంజూరు

- సిద్దిపేట మెడికల్ కాలేజీలో 16కు చేరిన పీజీ కోర్సులు
- హర్షం వ్యక్తం చేసిన ఎమ్మెల్యే హరీశ్‌రావు

సిద్దిపేట, ఆగస్టు 4: సిద్దిపేట మెడికల్ కాలేజీకి మరో మూడు పీజీ మెడికల్ కోర్సులు మంజూరైనట్లు మాజీ మంత్రి,స్థానిక ఎమ్మెల్యే హరీశ్‌రావు తెలిపారు. కళాశాలలో 11 పీజీ కోర్సులతో 58 మంది విద్యార్థులతో విద్యాబోధన జరుగుతోందన్నారు. కొత్తగా అనస్థీషియాలో 6 సీట్లు, పీడియాట్రిక్‌లో 4 సీట్లు, డెర్మటాలజీలో 4సీట్లతో కోర్సులు మంజూరైనట్లు తెలిపారు. మొత్తంగా సిద్దిపేట మెడికల్ కాలేజీలో 16 కోర్సులు 72 సీట్లతో పీజీ విద్యాబోధన జరుగనుందన్నారు. రాష్ట్రంలో 16 పీజీ మెడికల్ కోర్సులున్న కాలేజీగా సిద్దిపేట మెడికల్ కాలేజీ రికార్డు సాధించిందన్నారు. కొత్తగా మూడు పీజీ కోర్సులు మంజూరు కావడంపై సంతోషం వ్యక్తం చేశారు.

పురుగుల మందు తాగి రైతు ఆత్మహత్య

కొమురవెల్లి, ఆగస్టు 4: సిద్దిపేట జిల్లా కొమురవెల్లి మండలం గురువన్నపేట గ్రామానికి చెందిన బండారి కనకయ్య(49) శనివారం సాయంత్రం పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గ్రామస్తులు, పోలీసుల వివరాల ప్రకారం.. బండారి కనకయ్య బతుకుదెరువు కోసం 30ఏండ్ల క్రితం హైదరాబాద్‌కు వెళ్లి స్క్రాప్ దుకాణం పెట్టుకున్నాడు. బీఆర్ఎస్ హయాంలో ప్రాజెక్టులు, కాలువల నిర్మాణం చేపట్టడంతో సాగునీటి వసతి ఏర్పడి గ్రామంలో తనకున్న మూడెకరాల్లో గ్రామానికి చెందిన వ్యక్తి సాయంతో పంట సాగు చేస్తూ హైదరాబాద్ నుంచి వచ్చిపోయేవాడు. ఆయన కొన్నేండ్ల క్రితం పక్షవాతం బారినపడ్డాడు. బీపీ, షుగర్ సమస్యలతో బాధపడుతున్నాడు. ఇటీవల ప్రభుత్వం రుణమాఫీ చేసిందని ఆయన ఫోన్‌కు మెసేజ్ రావడంతో గ్రామానికి వచ్చాడు. ఆరోగ్యం సహకరించడం లేదని కలత చెంది శనివారం సాయంత్రం పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. గమనించిన చుట్టుపక్కల వారు గజ్వేల్ ప్రభుత్వ దవాఖానకు తరలించారు. పరిస్థితి విషమించడంతో వైద్యుల సూచన మేరకు హైదరాబాద్‌లో ప్రైవేట్ దవాఖానకు తరలించగా చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మృతి చెందాడు. మృతుడి కుమారుడు కమల్‌హాసన్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు కొమురవెల్లి ఎస్సై రాజుగౌడ్ తెలిపాడు.

మెడికల్ కాలేజీ ఉన్నట్టా..లేనట్టా?

మెదక్‌లో మెడికల్ కళాశాల ఏర్పాటుకు పాత కలెక్టరేట్ భవనం సిద్ధం

- పాత కలెక్టరేట్‌లో వసతులు సరిగా లేవన్న ఎన్ఎంసీ
- ఈ ఏడాది తరగతుల ప్రారంభం డౌటే
- బీఆర్ఎస్ ప్రభుత్వంలో 100 సీట్లతో కళాశాల మంజూరు
- 50 సీట్లకు కుదించిన కాంగ్రెస్ సర్కారు
- ఎన్ఎంసీకి అప్పీలుకు వారం రోజులే గడువు
- కాంగ్రెస్ ప్రభుత్వం పట్టించుకునేనా..?

మెదక్ పాత కలెక్టరేట్ భవనంలో మెడికల్ కళాశాల

మెదక్, ఆగస్టు 4 (నమస్తే తెలంగాణ): మెదక్ జిల్లాకేంద్రంలో మెడికల్ కళాశాల ఏర్పాటుపై జాతీయ వైద్య మండలి(ఎన్ఎంసీ) నీళ్లు చల్లింది. సరైన సౌకర్యాలు లేవని అనుమతులకు నిరాకరించింది. దీంతో మెడికల్ కళాశాల ఏర్పాటు ప్రశ్నార్థకంగా మారింది. 2014లో బీఆర్ఎస్ ప్రభుత్వం మెదక్ కేంద్రంగా జిల్లాను ఏర్పాటు చేసి ఆ తర్వాత నూతన కలెక్టరేట్, ఎస్పీ కార్యాలయాలను ఆధునిక హంగులతో నిర్మించింది. ప్రతి జిల్లాకు ఒక మెడికల్ కళాశాల ఏర్పాటులో భాగంగా మెదక్‌కు మంజూరు చేశారు. 100 సీట్లతో కూడిన భవన నిర్మాణానికి రూ.180 కోట్లు సీఎం కేసీఆర్ కేటాయించారు. గత అసెంబ్లీ ఎన్నికలకు ముందు అప్పటి మంత్రి తన్నీరు హరీశ్‌రావు, ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి మెడికల్ కళాశాల భవన నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఎన్నో ఏండ్ల కల నెరవేరిందని ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. కానీ, మెడికల్ కళాశాల ఏర్పాటుకు వసతులు సరిగా లేవనే కారణంతో జాతీయ వైద్య మండలి(ఎన్ఎంసీ) ఇటీవల అనుమతి నిరాకరించడంతో జిల్లా ప్రజలు నిరాశ చెందుతున్నారు.

14 ఎకరాలు... రూ.180 కోట్లు...

బీఆర్ఎస్ ప్రభుత్వం మెదక్ జిల్లాకేంద్రంలో 100 సీట్లతో మెడికల్ కళాశాల ఏర్పాటుకు 2023లో గ్రీన్‌సిగ్నల్ ఇచ్చి గతేడాది జూన్‌లో జీవో జారీ చేసింది. 2024-25 విద్యా సంవత్సరం నుంచి తరగతులు ప్రారంభించనున్నట్లు ఉత్తర్వుల్లో పేర్కొంది. మెడికల్ కళాశాల భవన నిర్మాణానికి రూ.180 కోట్లు మంజూరు చేసి, పరిపాలనా అనుమతుల కోసం సెప్టెంబర్ 16న జీవో నంబర్ 162 జారీచేసింది. మెడికల్ కళాశాలలో అవసరమైన 433 పోస్టులను సృష్టించి గతేడాది సెప్టెంబర్‌లో జీవో నంబర్ 123 విడుదల చేసింది. బీఆర్ఎస్ ప్రభుత్వం 100 సీట్లు కేటాయిస్తే, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం దానిని 50 సీట్లకు కుదించింది. మెదక్‌లో మెడికల్ కళాశాల భవనం ఏర్పాటు చేయాలంటే అన్ని వసతులు ఉండాలి. భవనం ఎక్కడ దొరకక పోవడంతో పాత కలెక్టరేట్ భవనాన్ని అద్దెకు తీసుకున్నారు. యాజమాన్యం అనుమతి ఇవ్వడంతో భవనానికి మరమ్మతులు, రంగులు వేశారు. జూలైలో జరిగిన వర్చువల్ సమావేశంలో జాతీయ వైద్యమండలి అధికారులు చూపిన సమస్యలు అన్నింటినీ పరిష్కరించారు. తాజాగా వసతులు లేవని అనుమతులు నిరాకరించడంతో మెడికల్ కళాశాల ఏర్పాటు అవుతుందో లేదోనన్న అనుమానం జిల్లా ప్రజల్లో వ్యక్తమవుతోంది. పాత కలెక్టరేట్ భవనంలో వసతులు సరిగా లేవని ఎన్ఎంసీ అనుమతి నిరాకరించింది. వైద్య పరికరాలు, ఫర్నిచర్, ఇతర సౌకర్యాలు సరిగా లేవని పేర్కొంది. తరగతుల నిర్వహణకు ఎంపిక చేసిన భవనంలో సరైన వసతులు లేవని, భవన లీజు విషయంలోనూ ఎన్ఎంసీ నిబంధనల ప్రకారం 30 ఏండ్ల వరకు ఉండాలనే విషయాలు అగ్రిమెంట్‌లో పొందుపర్చలేదని తెలిసింది. మెడికల్ కళాశాలకు జిల్లా కేంద్ర దవాఖానకు అనుసంధానం చేశారు. కళాశాలకు ఎనిమిది విభాగాల్లో బోధకులు అవసరం. ఇటీవల దరఖాస్తులను ఆహ్వానించగా పలువురు చేరారు. మొత్తంగా ఇప్పటివరకు 45 మంది ప్రొఫెసర్లు, అసిస్టెంట్ ప్రొఫెసర్లు వచ్చారు. ఇటీవల ఎన్ఎంసీ అధికారులు వర్చువల్ ద్వారా తనిఖీలు చేశారు. సౌకర్యాలు, సిబ్బంది వివరాలను తెలుసుకున్నారు. ఇందుకు సంబంధించిన నివేదికను రాష్ట్ర అధికారులు ఎన్ఎంసీకి అందజేసి అనుమతి ఇస్తుందన్న నమ్మకంతో ఉన్నారు. కానీ, సరైన సౌకర్యాలు లేవన్న కారణంతో ఎన్ఎంసీ అనుమతి నిరాకరించింది. ఇప్పుడు మళ్లీ అప్పీల్‌కు వెళ్లనున్నట్లు వైద్యాధికారులు చెబుతున్నాయి. ఈ అప్పీల్‌కు వారం రోజులే గడువు ఉంటుందని అంటున్నారు. మరి కాంగ్రెస్ ప్రభుత్వం చొరవ తీసుకుని అనుమతి తెస్తుందో..లేదో వేచి చూడాలి.

రిజిస్ట్రేషన్..అవినీతిమయం!

- ఏసీబీ దాడులతో రిజిస్ట్రేషన్ అధికారుల్లో గుబులు
- కొనసాగుతున్న ఏసీబీ విచారణ
- నిబంధనలకు విరుద్ధంగా రిజిస్ట్రేషన్లు..?
- రిజిస్ట్రేషన్లు, డాటా మాయం?

సంగారెడ్డి, ఆగస్టు 4(నమస్తే తెలంగాణ): సంగారెడ్డి జిల్లా రిజిస్ట్రేషన్ కార్యాలయం అవినీతి, అక్రమాలకు కేరాఫ్‌గా మారింది. నాలుగు రోజుల క్రితం సంగారెడ్డిలోని జిల్లా రిజిస్ట్రేషన్ కార్యాలయంలో హైదరాబాద్ నుంచి వచ్చిన ఏసీబీ అధికారులు ఆకస్మికంగా దాడులు చేసిన సంగతి తెలిసిందే. ఈ దాడిలో సబ్ రిజిస్ట్రార్లు ఎన్నో రోజులుగా సాగిస్తున్న అవినీతి, అక్రమాల బాగోతం బయటపడినట్లు సమాచారం. దాడులు ముగిసిన అనంతరం ఏసీబీ అధికారులు 84కు పైగా రిజిస్టర్ డాక్యుమెంట్లను, రూ.6 లక్షలకు పైగా నగదును తమవెంట తీసుకెళ్లినట్లు తెలిసింది. ఏసీబీ అధికారులు విచారణ కొనసాగుతుండంతో రిజిస్ట్రేషన్ అధికారుల్లో గుబులు నెలకొంది. ఎక్కడ తమ అవినీతి బాగోతం బయటపడుతుందోనని ఆందోళన చెందుతున్నారు. సంగారెడ్డి నుంచి బదిలీ అయిన అధికారులు కొత్త పోస్టుల్లో చేరాల్సి ఉన్నప్పటికీ, చేరకుండా నిబంధనలకు విరుద్ధంగా రిజిస్ట్రేషన్లు చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. నాలా కన్వర్షన్లు, ప్రొహిబిటెడ్ భూములను రిజిస్ట్రేషన్లు చేసినట్లు సమాచారం. ఏసీబీ అధికారుల దాడులు జరిగిన వెంటనే అప్రమత్తమైన అధికారులు తాము చేసిన రిజిస్ట్రేషన్ల డాటాను కంప్యూటర్ల నుంచి మాయం చేసినట్లు సమాచారం. దీంతో ఏసీబీ అధికారులు రిజిస్ట్రేషన్ ఆఫీసులో నుంచి రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్లతో పాటు కంప్యూటర్ హార్ట్‌డ్రైవ్‌లను వెంట తీసుకెళ్లారు.

నిబంధనలకు విరుద్ధంగా రిజిస్ట్రేషన్లు..?

సంగారెడ్డిలోని జిల్లా రిజిస్ట్రేషన్ కార్యాలయంతో పాటు సంగారెడ్డి, పటాన్‌చెరు సబ్ రిజిస్ట్రేషన్ కార్యాలయాలు ఉన్నాయి. ఈ రెండు కార్యాలయాల్లో నిబంధనలకు విరుద్ధంగా అధికారులు రిజిస్ట్రేషన్లు చేసినట్లు ఏసీబీ దాడిలో వెల్లడైనట్లు తెలిసింది. సంగారెడ్డి, పటాన్‌చెరు సబ్ రిజిస్ట్రార్లు ఇటీవల బదిలీ అయ్యారు. వీరు ఈనెల 1వ తేదీలోపు తమ కొత్త పోస్టుల్లో చేరాల్సి ఉంది. కొందరు సబ్ రిజిస్ట్రార్లు చివరిరోజు నిబంధనలకు విరుద్ధంగా పదులకొద్ది రిజిస్ట్రేషన్లు చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. రాష్ట్ర ప్రభుత్వం ధరణి స్థానంలో కొత్తగా భూమాత పోర్టల్ తీసుకు రానుండడం, భూముల విలువలను పెంచనుందన్న సమాచారంతో రియల్టర్లు, బిల్డర్లు, వ్యాపారులు ఈనెల 1వ తేదీ లోపు రిజిస్ట్రేషన్లు చేసుకోవడం ప్రారంభించారు. దీంతో జూలై 29,30, 1వ తేదీల్లో ఎన్నడూ లేనివిధంగా రోజుకు 200 నుంచి 400 వరకు రిజిస్ట్రేషన్లు జరిగాయి. బదిలీపై వెళ్తున్న అధికారులు, సిబ్బంది డబ్బులకు ఆశపడి నిబంధనలకు ఉల్లంఘించి డాక్యుమెంట్లను రిజిస్ట్రేషన్ చేసినట్లు తెలుస్తున్నది. ఔటర్ వరకు జీహెచ్ఎంసీని విస్తరిస్తామని ప్రభుత్వం ప్రకటించడంతో పటాన్‌చెరు,కొల్లూరు, తెల్లాపూర్, అమీన్‌పూర్‌లోని భూముల ధరలు అమాంతంగా పెరిగిపోయాయి. దీంతో పెద్ద పెద్ద రియల్టర్లు తమ పరిధిలోని వివాదాస్పద భూములను, ప్రొహిబిటెడ్ భూములను నిబంధనలకు విరుద్ధంగా రిజిస్ట్రేషన్లకు చేసుకునేందుకు సిద్ధమయ్యారు. బదిలీలపై వెళ్తున్న అధికారులకు పెద్దఎత్తున డబ్బులు ఇవ్వడంతో ఆ అధికారులు నిబంధనలకు కాలరాసి ప్రభుత్వ, ప్రొహిబిటెడ్ భూములను రిజిస్ట్రేషన్లు చేయడంతో పాటు నాలా కన్వర్షన్లకు ఆమోదం తెలిపినట్లు సమాచారం. ఈ విషయాన్ని ఏసీబీ అధికారులు తమ దాడుల్లో గుర్తించినట్లు తెలిసింది. ఇదే విషయమై సంగారెడ్డి నుంచి బదిలీ అయిన అధికారులను విచారిస్తున్నట్లు సమాచారం.

అవినీతికి కేరాఫ్ సంగారెడ్డి జిల్లా రిజిస్ట్రేషన్ ఆఫీస్

సంగారెడ్డిలోని రిజిస్ట్రేషన్ కార్యాలయం

రియల్టర్లు, బిల్డర్ల వాహనాల నుంచి డబ్బులు స్వాధీనం

ఏసీబీ అధికారులు దాడి చేసిన సమయంలో కార్యాలయంలో ఉన్న డాక్యుమెంట్ రైటర్ల నుంచి పెద్ద మొత్తంలో ఏసీబీ అధికారులు డబ్బులు స్వాధీనం చేసుకున్నారు. రిజిస్ట్రేషన్ కార్యాలయం వెలుపల ఉన్న ప్రతి వాహనాన్ని ఏసీబీ అధికారులు తనిఖీ చేశారు. ముఖ్యంగా రిజిస్ట్రేషన్ల కోసం వచ్చిన రియల్టర్లు, బిల్డర్ల వాహనాలను తనిఖీ చేసిన ఏసీబీ అధికారులు రూ.6 లక్షలకు పైగా నగదును స్వాధీనం చేసుకున్నట్లు సమాచారం. డాక్యుమెంట్ రైటర్ల నుంచి ఎంత డబ్బు స్వాధీనం చేసుకుంది తెలియరాలేదు.

హుస్నాబాద్‌లో విలేకరులతో మాట్లాడుతున్న మంత్రి పొన్నం ప్రభాకర్

'స్వచ్ఛదనం..పచ్చదనం'లో పాల్గొనాలి

- ప్రజలకు అవగాహన కల్పించి భాగస్వాములు చేయాలి
- పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత
- హుస్నాబాద్‌లో రవాణా, బీసీ సంక్షేమ శాఖల మంత్రి పొన్నం ప్రభాకర్

హుస్నాబాద్, ఆగస్టు 4: ప్రభుత్వం చేపట్టిన 'స్వచ్ఛదనం-పచ్చదనం'కార్యక్రమంపై అధికారులు, ప్రజాప్రతినిధులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు ప్రజలకు సంపూర్ణ అవగాహన కల్పించాలని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ పిలుపునిచ్చారు. ఆదివారం హుస్నాబాద్‌లోని క్యాంపు కార్యాలయంలో కార్యకర్తలు, నాయకులతో కలిసి స్నేహితుల దినోత్సవంలో పాల్గొన్న అనంతరం పట్టణంలోని రేణుకా ఎల్లమ్మ ఆలయాన్ని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆలయం వద్ద విలేకరులతో మాట్లాడుతూ..ఈనెల 5 నుంచి 9 వరకు నిర్వహించ తలపెట్టిన ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. హుస్నాబాద్ మున్సిపల్ పరిధిలోని అన్ని వార్డుల్లో, నియోజకవర్గంలోని అన్ని మండల కేంద్రాలు, గ్రామాల్లో చెత్తాచెదారం, పిచ్చిమొక్కలు, గడ్డిని తొలిగించి పరిసరాలు శుభ్రంగా ఉంచేలా చర్యలు చేపట్టాలన్నారు. ప్రభుత్వం సూచించిన విధంగా రోజూవారీ కార్యక్రమాలను విధిగా నిర్వహించాలని కోరారు. పరిసరాల పరిశుభ్రత అనేది ప్రతిఒక్కరి బాధ్యతగా గుర్తించాలని, తాగునీరు కలుషితం కాకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. సీజనల్ వ్యాధులపై ప్రజలను అప్రమత్తంగా చేయాలన్నారు. ప్రభుత్వ కార్యాలయాలు, అంగన్‌వాడీ కేంద్రాలు, పాఠశాలలు, వైద్యశాలల ఆవరణలో విధిగా నిత్యం పారిశుధ్య పనులు చేపట్టాలని సంబంధిత అధికారులు, సిబ్బందిని ఆదేశించారు. అందరి భాగస్వామ్యంతో వన మహోత్సవంలో భాగంగా ఖాళీ ప్రదేశాల్లో మొక్కలు నాటాలన్నారు. కార్యక్రమంలో సింగిల్ విండో చైర్మన్ బొలిశెట్టి శివయ్య, వల్లపు రాజు, చిత్తారి పద్మ, పున్న సది, ముత్యాల సంజీవరెడ్డి, కైలునాయక్ పాల్గొన్నారు.

జగదేవ్‌పూర్ కేజీబీవీని పరిశీలిస్తున్న పాఠశాల విద్యాడైరెక్టర్ వెంకటనర్సింహారెడ్డి

జగదేవ్‌పూర్ కేజీబీవీని అభివృద్ధి చేస్తాం

పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ వెంకటనర్సింహారెడ్డి

జగదేవ్‌పూర్ ఆగస్టు 4: జగదేవ్‌పూర్‌లోని కేజీబీవీ పాఠశాలను అన్నివిధాలుగా అభివృద్ధి చేస్తామని రాష్ట్ర పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ వెంకట్‌నర్సింహారెడ్డి అన్నారు. ఆదివారం జగదేవ్‌పూర్‌లోని కేజీబీవీ పాఠశాలను డీఈవో శ్రీనివాస్‌రెడ్డితో కలిసి తనిఖీ చేశారు. పాఠశాల పరిసరాలు, తరగతి గదులను పరిశీలించి విద్యార్థినులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. ప్రహరీ లేక ఇబ్బందులు ఎదురవుతున్నాయని విద్యార్థినులు తెలుపగా, ప్రహరీ నిర్మాణానికి కావాల్సిన నిధులు ఇవ్వనున్నట్లు తెలిపారు. కలెక్టర్‌తో ఫోన్‌లో మాట్లాడి కేజీబీవీ అభివృద్ధి పనులు చేపట్టాలని ఆదేశించారు. ఐఎఫ్‌పీ ప్యానల్స్ పరిశీలించి ఎందుకు నడవడం లేదని తెలుసుకున్నారు. కనెక్షన్ ఇవ్వలేదని సూచించడంతో వెంటనే ప్యానల్స్ ఆన్ అయ్యేలా చూడాలన్నారు. కిచెన్ షెడ్ స్టోర్ రూమ్‌ను పరిశీలించారు. సరిపడా బెంచీలు లేవని విద్యార్థినులు తెలుపడంతో మరిన్ని ఏర్పాటు చేస్తామన్నారు. కిచెన్ గార్డెన్ ఏర్పాటు చేయాలని, సోలార్ వాటర్ సిస్టం వాడాలని, టాయిలెట్స్ శుభ్రంగా ఉంచాలని ఎస్‌వోకు ఆదేశించారు. పాఠశాల అభివృద్ధికి నిధులు ఇస్తామని, వెంటనే పనులు ప్రారంభించి పూర్తి చేయాలని అమ్మఆదర్శ కమిటీ చైర్మన్‌కు సూచించారు. ఆయనకు ఎంఈవో ఉదయభాస్కర్‌రెడ్డి, పాఠశాల ఎస్‌వో ఉమామహేశ్వరి స్వాగతం పలికారు. కార్యక్రమంలో కేజీబీవీ జీసీడీవో ముక్తేశ్వరి, పీఆర్టీయూ నాయకులు శశిధర్‌శర్మ, శేఖర్, లింగం, నాగరాజు ఎంఐఎస్ గోవర్ధన్, సీఆర్పీ దయానంద్ ఉన్నారు.

గజ్వేల్‌లోని ఆఫీసర్స్ కాలనీలో దిగబడిన గ్యాస్ సిలిండర్ల ఆటో

గజ్వేల్‌లో బురదమయంగా కనిపిస్తున్న రోడ్డు

అధ్వాన రోడ్లతో అవస్థలు

- చినుకు పడితే బురదమయం
- ఇబ్బందులు ఎదుర్కొంటున్న ప్రజలు

గజ్వేల్, ఆగస్టు 4: గజ్వేల్ మున్సిపల్ పరిధిలోని ఆయా వార్డుల్లో రోడ్లు అధ్వానంగా మారాయి. నడిచేందుకు వీలులేకుండా గుంతలతో బురదమయంగా మారాయి. పూర్తిస్థాయిలో 20వార్డుల్లో సీసీ రోడ్లు చేపట్టకపోవడంతో మట్టిరోడ్లన్నీ వర్షాలకు బురదగా మారడంతో కాలినడకన నడిచే వారికి ఇబ్బందికరంగా మారింది. భారీ గుంతలు ఏర్పడడంతో ద్విచక్ర వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. మున్సిపల్ పరిధిలోని గజ్వేల్, ప్రజ్ఞాపూర్, క్యాసారం, మూర్తాజ్‌పల్లిలోని రోడ్లు అధ్వానంగా మారాయని పట్టణవాసులు వాపోతున్నారు. కొన్ని వార్డుల్లో కాలినడకన వెళ్లలేని పరిస్థితులు ఉన్నాయి. పట్టణంలోని లక్ష్మీప్రసన్న, సిరి ఎన్‌క్లేవ్, ఎయిర్‌టెల్ టవర్, ఆఫీసర్స్ కాలనీల్లో పూర్తిస్థాయిలో సీసీ రోడ్ల నిర్మాణాలు చేపట్టకపోవడంతో మట్టి రోడ్లు వర్షానికి బురదమయంగా మారి ఇబ్బందులు ఎదురవుతున్నాయి. దీంతో ప్రజలు అవస్థలు పడుతున్నారు.

బురద రోడ్లకు పరిష్కార మార్గం చూపుతాం..

మున్సిపల్ పరిధిలోని అన్ని వార్డుల్లో బురద రోడ్లు లేకుండా చర్యలు తీసుకుంటాం. కొద్ది రోజుల క్రితం మున్సిపల్ పరిధిలోని పలు కాలనీల్లో రూ.22.87కోట్లతో సీసీ రోడ్లను నిర్మించాం. పూర్తిస్థాయిలో నిధులు రాకపోవడంతో సీసీ రోడ్ల పనులు అన్ని కాలనీల్లో చేపట్టలేకపోయాం. ప్రభుత్వ సహకారంతో రాబోయే రోజుల్లో సీసీ రోడ్లు నిర్మిస్తాం. -రాజమౌళి, మున్సిపల్ చైర్మన్ గజ్వేల్

కుళ్లిపోయిన కూరగాయలే దిక్కా..?

- బుధేరా మహిళా డిగ్రీ రెసిడెన్షియల్ కళాశాల హాస్టల్‌లో నాణ్యమైన భోజనం కరువు
- సరిగ్గా అమలు కాని మెనూ

మునిపల్లి, ఆగస్టు 4: హాస్టళ్లపై అధికారుల పర్యవేక్షణ కరువై విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సంగారెడ్డి జిల్లా మునిపల్లి మండలంలోని బుధేరా మహిళా డిగ్రీ రెసిడెన్షియల్ గురుకుల కళాశాల విద్యార్థినులకు నాణ్యమైన భోజనం అందడం లేదు. మెస్ కాంట్రాక్టర్ నాసిరకం కూరగాయలతో భోజనం పెడుతున్నట్లు విద్యార్థినులు ఆరోపిస్తున్నారు. బుధేరా మహిళా డిగ్రీ కళాశాలపై సంబంధిత అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో హాస్టల్లో విద్యార్థినులకు రుచికరమైన, నాణ్యమైన భోజనం అందడం లేదు. హాస్టల్‌లో ఉంటూ చదువుకుంటున్న సుమారు 400 మంది వరకు విద్యార్థినులకు నాసిరకం కూరగాయలు, కుళ్లిన కూరగాయలతో భోజనాలు పెడుతుండడంతో అనారోగ్యం బారినపడే అవకాశాలు ఉన్నాయి. అంతేకాకుండా మెనూ సరిగ్గా అమలు చేయడం లేదని విద్యార్థినులు ఆరోపిస్తున్నారు. విద్యార్థినులకు క్రమం తప్పకుండా ఒకే రకమైన కూరగాయలు వండి పెడుతున్నట్లు తెలిసింది. జిల్లా అధికారులు స్పందించి బుధేరా మహిళా డిగ్రీ కళాశాల విద్యార్థినులకు నాణ్యమైన భోజనం అందించేలాలని చర్యలు తీసుకోవాలని విద్యార్థినులు కోరుతున్నారు.

బుధేరా మహిళా డిగ్రీ కళాశాల హాస్టల్‌లో కుళ్లిపోయిన ఉల్లిగడ్డలు, పాడైన పచ్చిమిర్చి

చైర్మన్ పదవికి పోటాపోటీ

- హాట్ సీటుగా కొమురవెల్లి ఆలయ చైర్మన్ పదవి
- గొల్ల కురుమలకు కేటాయించాలని అసెంబ్లీలో ప్రస్తావన
- మొదటిసారి శాసనసభలో చైర్మన్ కేటాయింపు డిమాండ్
- 82 దాటిన పాలక మండలి దరఖాస్తులు



చేర్యాల, ఆగస్టు 4: రాష్ట్రంలో ప్రముఖ ఆలయాల్లో ఒకటైన కొమురవెల్లి మల్లికార్జున స్వామి ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్, డైరెక్టర్ల పదవులకు తీవ్ర పోటీ నెలకొంది. యాదవ సామాజిక వర్గం ఆరాధ్య దైవమైన కొమురవెల్లి మల్లన్న ఆలయ పాలక మండలి చైర్మన్ పదవిని అదే సామాజిక వర్గానికి కేటాయించాలని దేవాలయ చరిత్రలో ఎన్నడూ లేనివిధంగా ఇటీవల అసెంబ్లీ సమావేశాల్లో ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య ప్రస్తావించారు. హైదరాబాద్‌లో కాంగ్రెస్ పార్టీకి చెందిన సీనియర్ నేత, మాజీ ఎంపీ అంజన్‌కుమార్, ఆయన కుమారుడు రాజ్యసభ సభ్యుడు అనిల్‌కుమార్ యాదవ్ సైతం కొమురవెల్లి ఆలయ చైర్మన్ పదవిని తమ సామాజిక వర్గానికి ఇప్పించుకునేందుకు పావులు కదుపుతున్నారు. ఇటీవల అసెంబ్లీ సమావేశాల్లో సైతం ఆలయ చైర్మన్ పదవి విషయం ప్రస్తావించడంతో అనాధిగా వస్తున్న సంప్రదాయం మేరకు నియోజకవర్గానికి చెందిన నాయకుడికి పదవి దక్కుతుందా లేక రాష్ట్రస్థాయి నేతలు అనుకున్న వారికి దక్కుతుందా అనే మీమాంసలో అధికార పార్టీ శ్రేణులు ఉన్నారు. నియోజకవర్గానికి చెందిన డీసీసీ అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డికి మల్లన్న ఆలయ పాలక మండలి చైర్మన్ పదవి ఎంపిక విషయంలో తలమునకలై ఉన్నారు.

దరఖాస్తు చేయని సామాజిక వర్గం నాయకులు

జనగామ నియోజకవర్గంలోని కొమురవెల్లి మల్లన్న ఆలయ చైర్మన్ పదవితోపాటు డైరెక్టర్ల పదవులు సైతం అధికార పార్టీకి చెందిన వారికి రావడం ఆనవాయితీగా వస్తున్నది. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు అనంతరం నాటి సర్కారు చైర్మన్‌తో పాటు కమిటీలో సభ్యులను నియోజకవర్గానికి చెందిన నాయకులకే ఎక్కువగా కేటాయించి, హైదరాబాద్‌కు చెందిన కొందరు దాతలకు అవకాశం కల్పించింది.కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన అనంతరం మొదటిసారిగా ధర్మకర్తల మండలి కాకుండా ఉత్సవాలు విజయవంతంగా కొనసాగించేందుకు ఫెస్టివల్ కమిటీ ఏర్పాటు చేసింది. అందులో నియోజకవర్గంలోని నాయకులు ఎక్కువగా, ఇతరులకు తక్కువ ప్రాధన్యత ఇచ్చింది. కానీ, అనాధిగా వస్తున్న సంప్రదాయం మేరకు నియోజకవర్గానికి చెందిన నాయకులకు చైర్మన్ పదవి ఇవ్వాల్సి వస్తుంది. చైర్మన్ పదవి అసెంబ్లీలో ప్రస్తావనకు రావడం తమ వారికే కావాలని రాజ్యసభ సభ్యుడు, ప్రభుత్వ విప్‌తో పాటు జిల్లా మంత్రి పొన్నం ప్రభాకర్ పావులు కదుపుతుండడంతో ఈసారి స్థానికులకు అవకాశాలు 'చే'జారే అవకాశం కనిపిస్తున్నది. గతంలో ఉన్న సంప్రదాయాన్ని కొనసాగించాలంటే నిబంధనల మేరకు దేవాదాయ శాఖ నోటిఫికేషన్ జారీచేసిన సమయంలో దరఖాస్తు చేసుకున్న వారికి ఇవ్వాల్సి ఉంటుంది. కానీ, దరఖాస్తులను పరిశీలిస్తే గొల్లకురుమ సామాజికవర్గానికి చెందిన నాయకులు ఒకరిద్దరు మినహా ఎక్కువగా దరఖాస్తు చేసుకోలేదని సమాచారం.

కమిటీలో చోటు కోసం 82 దరఖాస్తులు

పాలక మండలిలో చోటుకోసం జనగామ నియోజకవర్గంలోని 8 మండలాల నుంచి 22 మంది దరఖాస్తు చేసుకున్నట్లు తెలిసింది. రాష్ట్ర వ్యాప్తంగా వివిధ ప్రాంతాల నుంచి మరో 60మంది దరఖాస్తులు సమర్పించారు. మంత్రి పొన్నం, ఎంపీ అనిల్‌కుమార్, జహీరాబాద్ ఎంపీ సురేశ్‌షెట్కార్, మేడ్చల్ కాంగ్రెస్ నేత వజ్రేశ్‌యాదవ్, జూబ్లీహిల్స్ యూత్ కాంగ్రెస్ నేతతోపాటు నియోజకవర్గానికి చెందిన పర్వాటకం లక్ష్మారెడ్డి, గంగం నర్సింహారెడ్డి, కొప్పరపు జయప్రకాశ్‌రెడ్డి చైర్మన్ పదవి కోసం ప్రయత్నిస్తున్నట్లు తెలిసింది. ఓ వైపు గొల్లకురుమ సామాజికవర్గం, మరోవైపు చైర్మన్ పదవి ఎంపిక విషయంలో నియోజకవర్గ ఇన్‌చార్జి కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి ఎవరి వైపు మొగ్గు చూపుతారో అనే ఉత్కంఠ నెలకొంది. నియోజకవర్గంలో నెలకొన్న సమస్యలు, నామినేటెడ్ పదవుల కేటాయింపుపై సీఎం రేవంత్‌రెడ్డిని కొమ్మూరి శుక్రవారం అసెంబ్లీలో కలిసి విజ్ఞప్తి చేశారు. స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో వచ్చే బ్రహ్మోత్సవాలకు ఫెస్టివల్ కమిటీ ఏర్పాటు చేసే యోచనలో ప్రభుత్వం ఉన్నట్లు సమాచారం.

ప్రయాణం..నరకయాతన

- సిద్దిపేటలో అధ్వానంగా మారిన ఎల్లమ్మ ఆలయ రహదారి
- ఈ రో